క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకిసేవ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : మండలంలోని కనుపర్తి, నరసింహకండ్రిగ గ్రామాల్లో బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తారని కనుపర్తి ఎంపీటీసీ సభ్యుడు మెంతెం బాలకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు తెలుసుకుంటారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : మండలంలోని చాటగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తోడేరు, మరుపూరు, బిరదవోలు ఫీడర్స్‌కు బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పొదలకూరు ఏడీఈ సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. తోడేరులో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను చార్జ్ చేసేందుకు పనులు జరుగుతున్న కారణంగా చాటగొట్ల సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరాను నిలిపివేయాల్సి వస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మినగల్లు విద్యార్థి



రవిచంద్ర

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని మినగల్లుకు చెందిన పిడుగు మధు కుమారుడు పి.రవిచంద్ర రాష్ట్రస్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా తండ్రి మధు మంగళవారం మాట్లాడుతూ ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన అంతర్రాష్ట్రాల టెన్నీస్ బాల్ క్రికెట్ పోటీల్లో రవిచంద్ర ప్రతిభ చూపడంతో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగే రాష్ట్ర జూనియర్ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

బీమా సాయం అందజేత

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని రేబాల గ్రామానికి చెందిన చింతల శ్రీహరి గుండెపోటుతో మృతిచెందగా వైఎస్సార్ బీమా పథకం కింద మంగళవారం తక్షణ ఆర్థిక సాయం ద్వారా రూ.10 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మృతుడి భార్య భవానికి నగదు సాయాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, నేతలు హరిప్రసాద్‌రెడ్డి, మస్తానయ్య పాల్గొన్నారు.

బంగారంతో ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్): ఆభరణాల తయారీకి ఇచ్చిన బంగారంతో తయారీదారుడు పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో నివాసం ఉంటున్న అశోక్‌కుమార్ ఆనంవారి వీధిలోని లలితా జ్యువెలరీ మార్ట్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఈద్గామిట్టకు చెందిన కరిముల్లాకు పదేళ్లుగా ముడి బంగారాన్ని ఇచ్చి బంగారు ఆభరణాలను తయారు చేయించి తీసుకెళ్లేవారు. కరిముల్లా సైతం ఎంతో నమ్మకంగా ఉంటూ చెప్పిన సమయానికే ఆభరణాలను తయారుచేసిచ్చేవారు. ఈ క్రమంలో ఆభరణాల తయారీకి గానూ 990.12 గ్రాముల ముడి బంగారాన్ని కరిముల్లాకు అశోక్‌కుమార్ మార్చి 26న ఇచ్చారు. 55 గ్రాముల ఆభరణాలను తయారు చేసి మార్ట్‌లో కరిముల్లా ఇచ్చారు. మిగిలిన ఆభరణాలను త్వరలోనే ఇస్తానని నమ్మబలికారు. అయితే రోజులు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో అశోక్ ప్రశ్నించగా కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో రూ.46.75 లక్షల విలువజేసే 935 గ్రాముల బంగారుతో కరిముల్లా పరారయ్యారు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో నిందితుడి ఇల్లు, దుకాణం వద్దకు గత నెల 25న అశోక్‌కుమార్ వెళ్లగా, రెండింటికి తాళం వేసి ఉంది. చుట్టుపక్కల ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిపై చీటింగ్ కేసును ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు నమోదు చేశారు.

పోషకాహారంతో క్షయకు చెక్

- క్షయ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కొడవలూరు : వైద్యుల సూచనలు, తగిన పోషకాహారం తీసుకుంటే క్షయ వ్యాధికి చెక్ పెట్టవచ్చని వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు మండలంలోని క్షయ బాధితులకు కొడవలూరు పీహెచ్‌సీ సిబ్బంది సొంత నిధులతో మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ బాధితులు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్లే పోషక విలువలున్న సరుకులను పంపిణీ చేశామన్నారు. క్షయ వ్యాధి సోకగానే కృంగి పోవాల్సిన అవసరం లేదని, వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా తీసుకోవడంతో పాటు పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే సులువుగా నయమవుతుందని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి–2 బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏ షఫీ ఉద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పొదలకూరు : ఆహార ధాన్యాలను అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆహార ధాన్యాల పంపిణీ

పొదలకూరు : టీబీ బాధితులకు ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహ్మదాపురం పీహెచ్‌సీలో పోషక విలువలతో కూడిన ఆహార ధాన్యాలను పంపిణీ చేశారు. టీబీ నియంత్రణాధికారి వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు డాక్టర్ ఎం.రమేష్ బాధితులకు పోషక విలువలు కలిగిన ధాన్యాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నియంత్రణ కోసం చికిత్స పొందుతున్న వారికి ధాన్యాలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శబరీనాథ్, ఆదిలక్ష్మమ్మ, రవికుమార్, శ్రీనివాసరావు, రమణమ్మ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ పీహెచ్‌సీలో..

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీలో టీబీ వ్యాధితో బాధ పడుతున్న వారికి మంగళవారం నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు అహ్మద్‌బాబు మాట్లాడుతూ టీబీ వ్యాధితో బాధపడుతున్న వారికి కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా రూ.500 ఇస్తోందని తెలిపారు. టీబీ బాధితులను ఆదుకోవాలన్న ప్రధాని మోదీ పిలుపు మేరకు తమ వైద్యశాలకు చెందిన ఆరోగ్య సిబ్బంది ముందుకొచ్చి టీబీతో బాధపడుతున్న వారికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారని తెలిపారు. అనంతరం సిబ్బందిని అభినందించారు. అలాగే దాతలు ముందుకొచ్చి టీబీ బాధితులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుబ్బమ్మ, సురేష్ పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: టీబీ బాధితులకు నిత్యవరస సరుకులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



కొడవలూరు : నిత్యావసర సరుకులు అందజేస్తున్న వైద్యాధికారులు

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు తులసీరాం స్వామి ఆధ్వర్యంలో తొలుత విశేష పూజలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి స్వామివారు శేషవాహనంపై ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. ఉభయదాతలుగా ముంగర వెంకటబాలకృష్ణారెడ్డి దంపతులు వ్యవహరించారు. గ్రామస్తులు కొబ్బరికాయ, కర్పూర హారతులు అందజేసి స్వాగతం పలికారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

సీహెచ్‌సీకి ఏసీల వితరణ

కోవూరు : కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా మూడు ఏసీలను వితరణగా అందించారు. వాటిని డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబు రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డిలు ఏసీకి సంబంధించిన రిమోట్లను మంగళవారం వైద్యశాల సూపరింటెండెంట్ విజేతకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రం కేంద్రానికి ఎంతో మంది గర్భిణులు, బాలింతలు వస్తుంటారని, వేసవి నేపథ్యంలో వారికి ఎలాంటి అవస్థలు పడకుండా ఏసీ గదులు ఉంటే బాగుంటుందని భావించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ద్వారా ఏసీలు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగ మండలాధ్యక్షుడు అనూప్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

వేగంగా ప్రహరీ నిర్మాణం

పొదలకూరు : పట్టణంలోని మండల సొసైటీ కార్యాలయానికి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ గోడ నిర్మాణానికి రూ.5.80 లక్షలు మంజూరైనట్లు సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సొసైటీ కార్యాలయం చాలా ఏళ్లుగా ఉన్నా కాంపౌండ్ వాల్ లేకపోవడం వల్ల ఇబ్బందిగా మారింది. ఫలితంగా కార్యాలయంలోకి పందులు, కుక్కలు చొరబడేవి. దీనిని దృష్టిలో ఉంచుకుని గోడ నిర్మాణ పనుల కోసం నిధులను మంజూరు చేయించారు.



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గోగిరెడ్డి

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి



హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న విద్యాధరి

- ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి

కొడవలూరు : మండలంలో జరుగుతున్న నాడు–నేడు పనులను జూన్ 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని ట్రెయినీ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నాడు–నేడు పనులు జరుగుతున్న 23 పాఠశాలల హెచ్‌ఎంలతో మంగళవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో నాడు–నేడు కింద 23 పాఠశాలలకు రూ.6.54 కోట్లు మంజూరు అయిందన్నారు. ఇప్పటికే తొలి విడతగా రూ.1.82 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు రూ.1.12 కోట్లు ఖర్చు చేయగా, ఇంకా రూ.70 లక్షల నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సిమెంట్ కూడా అందుబాటులోకి వచ్చినందున త్వరగా పనులు పూర్తి చేసేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని చెప్పారు. ప్రతిరోజూ జరుగుతున్న ప్రోగ్రెస్‌ను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభ సమయానికి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. తొలుత ఆమె గండవరం, కొడవలూరు, టపాతోపు పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, సీఆర్పీలు వీరాంజనేయులు, జె.పెంచలరావు, ఎం.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకుడికి గాయాలు

నెల్లూరు(క్రైమ్) : మోపెడ్ ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన ఘటన కొత్త పెన్నా బ్రిడ్జిపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరులో తన బంధువుల గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గానూ జలదంకి మండలం వేములపాడుకు చెందిన చిన్నయ్య బైక్‌పై బయల్దేరారు. కొత్త పెన్నా బ్రిడ్జిపైకి వచ్చేసరికి వెనుకవైపు నుంచి వస్తున్న టీవీఎస్ మోపెడ్ ఢీకొంది. బైక్ హ్యాండిల్‌కు తగలడంతో చిన్నయ్య కిందపడి గాయపడ్డారు. దీంతో క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసన్న విశ్వేశ్వరునికి పులివాహన సేవ

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పులివాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. కార్యక్రమాలకు ఉభయకర్తలుగా సుభాష్ ఆక్వా ఫీడ్స్ అధినేత పామంజి నరసింహులు, అనిత దంపతులు వ్యవహరించారు. ఉదయం చప్పర ఉత్సవం వేడుకగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు, ఈఓ తాత శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.



పులివాహనంపై ప్రసన్న విశ్వేశ్వరుడు

సొసైటీ కార్యాలయంలో డీసీఓ తనిఖీలు

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం సహకార సంఘ కార్యాలయాన్ని జిల్లా సహకారాధికారిని బి.సుధాభారతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ రైతులకు సహకార సంఘాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సకాలంలో ఎరువులు అందించడంతో పాటు అవసరాలకు రుణ సదుపాయం కల్పించి ఆసరాగా నిలవాలని సూచించారు. ఆమె వెంట ఎస్డీఎల్‌సీఓ ఎంవీ సుభాషిణి, కోవూరు సీనియర్ ఇన్‌స్పెక్టర్ పి.శివకుమార్, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



యల్లాయపాళెం సొసైటీ కార్యాలయంలో సిబ్బందిలో మాట్లాడుతున్న డీసీఓ

హంసవాహనంపై నృసింహుడు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు విశేష పూజలను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. చప్పరోత్సవం, హంసవాహనసేవను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో మంగళవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రావు పనినిమిత్తం ఆటోలో గొలగమూడికి వచ్చారు. తిరిగి ఆటోలో నెల్లూరుకు వెళ్తుండగా సర్వేపల్లి కాలువ మలుపురోడ్డు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రావులకు గాయాలవడంతో వారిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న బైక్

- వ్యక్తికి తీవ్రగాయాలు

బుచ్చిరెడ్డిపాళెం : ఆటోను బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని పెనుబల్లి శివారులోని రైస్‌మిల్లు సమీపంలో మలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం నుంచి పెనుబల్లి వైపు ఆటోలో కంకరను తీసుకెళ్తుండగా నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా రాంగ్‌రూట్లో వెళ్లి ఆటోను ఢీకొని రోడ్డుపై పడ్డాడు. దీంతో ద్విచక్ర వాహనదారుడి తలకు బలమైన గాయాలయ్యాయి. అదే సమయంలో జొన్నవాడలో విధులు ముగించుకుని స్టేషన్‌కు వెళ్తున్న ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని మరో ఆటో లో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదని ఎస్సై తెలిపారు.



ప్రమాదానికి గురైన బైక్

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోవూరు : కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఓ అంగన్‌వాడీ వర్కర్, ఆయా పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు సీడీపీఓ జ్యోతి మంగళవారం తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విడవలూరు మండలంలోని ఊటుకూరు మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు జనరల్ కేటగిరికి కేటాయించారు. కాగా ఆయా పోస్టులకు సంబంధించి కోవూరు వేగూరు వసంతపురం బీసీ–ఏ, బుచ్చిరెడ్డిపాళెం కాళయకాగొల్లు (ఎస్టీ), విడవలూరు మండలంలోని రామతీర్థం(ఎస్టీ), వరిణి –1 (జనరల్) కేటగిరిలో ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు.

- **ముత్తుకూరు :** మండలంలోని ఈపూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ హేనాసుజన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు.
- **పొదలకూరు :** మండలంలోని అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సీడీపీఓ అన్నపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని రామ్‌నగర్ అంగన్‌వాడీ టీచర్ పోస్టు(జనరల్ ఓసీ), తోడేరు పంచాయతీ శాంతినగర్(ఎస్సీ), మహ్మదాపురం (ఎస్టీ), చెన్నారెడ్డిపల్లి(జనరల్ ఓసీ) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నందున దరఖాస్తులు ఆన్‌లైన్లో సమర్పించాల్సిందిగా సూచించారు. ఈనెల 3 నుంచి 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను సమర్పించాల్సిందిగా తెలిపారు.
- **ఇందుకూరుపేట :** మండలంలోని కొరుటూరులో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ హేనాసుజన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): జనావాసాల మధ్య తిరుగుతూ ప్రమాదకరంగా మారిన వీధి కుక్కల నియంత్రణకు తక్షణమే చర్యలు చేపట్టాలని మేయర్ స్రవంతి ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలో సోమవారం పట్టపగలు దాదాపు 40 మందికిపైగా పిచ్చికుక్క కాటుకు గురవడం బాధాకరమన్నారు. పిచ్చికుక్కలు ఎక్కడెక్కడున్నాయో గుర్తించాలని అధికారులకు సూచించారు.



మాట్లాడుతున్న స్రవంతి

దిగజారిన నిమ్మధరలు

- పత్తి కూడా అంతంత మాత్రమే..
- గతేడాదితో పోల్చితే నిరాశే

పొదలకూరు : ఈ ఏడాది నిమ్మ, పత్తి ధరలు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరగలేదు. గతేడాది ఈ రెండు పంటల పండించిన రైతులకు మేలు జరిగింది. ఫలితంగా ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ధరలు ఉంటాయని రైతులు పత్తిసాగు విస్తీర్ణం పెంచారు. నిమ్మ రైతులైతే ధరలు పెరిగి ఆర్థిక స్వావలంబన కూడుతుందని భావించారు. అయితే ఈ ఏడాది వరి పండించిన రైతులకు గిట్టుబాటు కంటే ఊహించని విధంగా 20 శాతం ధరలు పెరిగి నిలదొక్కుకున్నారు. నిమ్మ మాత్రం పెరగకుండా నిలకడగానే ఉంది. ఏప్రిల్ నెలాఖరులో కూడా ధరలు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరగలేదు. గతేడాది బస్తాకాయలు టాప్ రూ.10,500 పలికాయి. ప్రస్తుతం పొదలకూరు మార్కెట్ యార్డులో లూజు(బస్తా) ఒక్కటింటికి రూ.2,400 నుంచి రూ.5 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. కిలోల వంతున పరిశీలిస్తే రూ.22 నుంచి రూ.72 ధర గిట్టుబాటు అవుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. దీంతో రైతులకు ఏప్రిల్ చివరిలో కూడా నిరాశే మిగిలింది. తోటల్లో కాయల దిగుబడి పెరగడం వల్ల మార్కెట్లో ధరలు పెరగడం లేదని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. మే నెల మధ్యలో తోటల్లో కాయలు దిగుబడి పెరిగే అవకాశం ఉన్నా ధరలు ఎలా ఉంటాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలం చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో నిమ్మతోటలు సాగు చేస్తున్నారు. నిమ్మపైనే చాలామంది రైతులు ఆధారపడి జీవిస్తుండగా నిమ్మకాయల వల్లనే రైతులు ఆర్థికంగా నిలబడగలుగుతున్నారు. ఫలితంగా సాగు విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. వేసవి తాపం, కాయలకు పెరిగే డిమాండ్‌ను బట్టి మే నెలలో ధరలు ఉంటాయని భావిస్తున్నారు.



యార్డుకు వచ్చిన నిమ్మకాయలు